

చిన్నారులకు ఆట పాట మాట

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో క్రియేటివ్ చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యాన చిన్నారులకు ఆట, పాట, మాట కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పిల్లలకు తొలుత రింగ్ ఆట ఆడించారు. పాటల పోటీలు నిర్వహించిన అనంతరం ఉపన్యాస పోటీలు పెట్టారు. ప్రముఖ రచయిత చింతాడ రామారావు, విద్యావేత్త కొత్తకోట అప్పారావు, ప్రధానోపాధ్యాయులు పేడాడ వేదవతి, గాయకులు సిహెచ్.రామచంద్రరావు రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మొత్తం 73 మంది పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు పాల్గొన్నారు.

117 జిఒను రద్దు చేయాలి

- పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి
- ఫ్యాప్టో చైర్మన్ ఎన్.వెంకటేశ్వరరావు
- కలెక్టరేట్ వద్ద 12 గంటల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యారంగానికి చేటు చేసే, పాఠశాలల బోధనా విధానానికి అన్యాయం చేస్తున్న జిఒ నంబరు 117ను రద్దు చేయాలని ఫ్యాప్టో చైర్మన్ ఎన్.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద 12 గంటల నిరసన కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 117 జిఒతో వేలాది ఉపాధ్యాయుల పోస్టులను రద్దు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో 14,202 పాఠశాలలు సింగిల్ టీచర్‌తో నడుస్తున్నాయని, విలీనం పేరుతో వేలాది స్కూళ్లను ఇప్పటికే మూసివేశారని తెలిపారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అధికారంలోకొచ్చాక గాలికి వదిలేశారని విమర్శించారు. సకాలంలో డిఎలు ఇవ్వడం గానీ, ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ చేపట్టడం గానీ చేయడం లేదన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించడం విషయంలో ప్రజాస్వామ్య దక్పథం, చిత్త శుద్ధి ప్రభుత్వానికి లేదన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మజ్జి మదన్మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను నిరంతరం వేధించడం, ఉద్యమాలపై ఉక్కుపాదం మోపడం ప్రభుత్వానికి నిత్యకృత్యంగా మారిందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగు కాక ముందే ఈ వ్యవస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పేడాడ కృష్ణారావు మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర మాట్లాడుతూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తీరు మార్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులపై ఆయన అనుసరిస్తున్న వేధింపు ధోరణి తగదన్నారు. తీరు మార్చుకోకపోతే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. ఎస్టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఉపాధ్యాయులపై నెట్టడం సమంజసం కాదన్నారు. ఎపిటిఎఫ్ (1938) జిల్లా అధ్యక్షులు టెంక చలపతిరావు మాట్లాడుతూ విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేయడానికి ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఇంటీరియం రిలీఫ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బలివాడ ధనుంజయరావు మాట్లాడుతూ విద్యార్థులను ఆంగ్ల భాషలోనే పరీక్ష రాయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ కె.అప్పలరాజు, హరిప్రసన్న, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, గొంటి గిరిధర్, డిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు, ఆప్టా జిల్లా అధ్యక్షులు ఎస్.గోవిందరాజు, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ముకుందరావు, పాపారావు, సిపిఎస్ సంఘ నాయకులు కె.రాజేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుల సంఘ నాయకులు వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫ్యాప్టో చైర్మన్ వెంకటేశ్వరరావు

బిసిల అభ్యున్నతికి కృషి

రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాలకృష్ణ

ప్రజాశక్తి - ఆమదాలవలస

రాష్ట్ర ప్రభుత్వం బిసిల అభ్యున్నతికి కృషి చేస్తోందని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన సంక్షేమ జూనియర్ కళాశాలను శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంతో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ బిసి విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంసిఎ, ఎంబిఎ వంటి కోర్సులు చదివి ఉన్నతస్థాయిలో ఉన్నారంటే కీ.శే వైఎస్ రాజశేఖర్ రెడ్డి తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కారణమన్నారు. బిసిలను అణగదొక్కేందుకు 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు కుటిల ప్రయత్నాలు సాగించారని ఆరోపించారు. బిసిల ద్రోహి చంద్రబాబు అని అన్నారు. వైసిపి ప్రభుత్వం బిసిల అభివృద్ధికి 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందన్నారు. ఆయా కార్పొరేషన్ల ద్వారా ఆ సామాజిక తరగతులను అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ స్పంకల్పమని తెలిపారు. బిసి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు ఐఐటి, ఎయిమ్స్ వంటి ప్రఖ్యాత జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేందుకు ఇప్పట్నుంచే కష్టపడి చదవాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి సంక్షేమ పథకాల డబ్బులను లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో బటన్ నొక్కి జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాడు- నేడు ద్వారా విద్య రంగానికి మౌలిక వసతులు కల్పిస్తోందని చెప్పారు. కార్పొరేట్‌కు ధీటుగా బిసి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను తీర్చిదిద్దాలని కోరారు. మంత్రి ప్రసంగం సమయంలో సభ నుంచి డ్వాక్రా మహిళలు వెళ్లిపోతుండడంతో వారిని ఆపడానికి స్వయం సహాయక సంఘ ఆర్‌పిలు ఇబ్బందులు పడ్డారు. అనంతరం మండలంలో 117 సంఘాలకు గాను 12,296 మంది సభ్యులకు రూ.79,26,132 నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, తూర్పు కాపు, కళింగ వైశ్య కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, ఆర్‌డిఒ బి.శాంతి, రెసిడెన్షియల్ స్కూల్ వెల్ఫేర్ సెక్రెటరీ కృష్ణమోహన్, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ



మాకన్నపల్లిలో చేపడుతున్న సంతకాల సేకరణ

జోరుగా 'జీడి మద్దతు' సంతకాల సేకరణ

పలాస : జీడి మద్దతు ధరపై సంతకాల సేకరణ ఉద్యమం జోరుగా సాగుతోంది. మండలం లోని బొడ్డపాడు, మాకనపల్లి, నీలవతి, గురుదాసుపురం, మామిడిమెట్టులో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీడిరైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ మాట్లాడుతూ 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని చేపడుతున్న సంతకాల సేకరణ ఉద్యమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జీడి పంటకు మద్దతు ధర ధర ఇవ్వడం ద్వారా జీడి పంటను విస్తారంగా పండిస్తారని, తద్వారా అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెంది వేలాది మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. జీడికి గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల సాగు పెట్టుబడి గిట్టుబాటు కాకపోవడంతో రైతులు తీవ్రమైన దోపిడీకి గురవుతున్నారన్నారు. 2019లో జీడి బస్తా రూ.14 వేలు పలకగా, ప్రస్తుతం రూ.ఏడు వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక జీడిపిక్కలు కొనుగోలు చేసిన తర్వాతనే విదేశీ పిక్కలకు అనుమతి ఇవ్వాలని, కేరళ తరహాలో జీడిబోర్డు ఏర్పాటు చేయాలని, జీడి రైతులకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జీడికి మద్దతు ధర ప్రకటించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మెట్టూరు కొండప్ప సురేఖ, లండ రాజేశ్వరి, భోజరాజు, అంబటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ఆమదాలవలస : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్క రించాలని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణను ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, జాప్ జిల్లా అధ్యక్షులు జి.షణ్ముఖరావు కోరారు. మంత్రిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతం మాదిరిగానే అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోనూ చిన్న, మధ్యతరహా పత్రికల విలేకరులకు, లోకల్ పేపర్స్, డెస్క్ జర్నలిస్టులకు, లోకల్ ఛానల్స్ విలేకరులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరారు. పాత్రికేయ వృత్తిలో నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు ఎక్కువ మంది ఉన్నందున జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు, ఇళ్లు, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2024 లోక్‌సభ, శాసనసభ ఎన్నికల నేపథ్యంలో న్యూస్ కవరేజ్‌కు వెళ్లనున్న అక్రిడిటేషన్ లేని జర్నలిస్టులకు సెక్యూరిటీ పరంగా ఇబ్బందులు ఎదురుకానున్న నేపథ్యంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో టెంక శ్రీను, శివాజీ, నాగు, కిల్లాడ రాజు తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘ నాయకులు

ప్రాజెక్టుల పెండింగ్‌కు చంద్రబాబే బాధ్యుడు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఏ ప్రాజెక్టులు పూర్తి చేశారో చంద్రబాబు నాయుడు చెప్పాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసి ఎవరిని ప్రశ్నిస్తారని ఆయన అన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చూపింది చంద్రబాబేనని అన్నారు. నాలుగేళ్ల కిందట వచ్చిన వైసిపి ప్రభుత్వాన్ని మీరెలా ప్రశ్నిస్తారని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాడు వైఎస్ ప్రారంభించిన జలయజ్ఞంలో భాగంగా వంశధార, తోటపల్లి, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ జిల్లాకు వచ్చాయని గుర్తుచేశారు. వంశధార ప్రాజెక్టును చంద్రబాబు ఏ రోజైనా పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. వైఎస్ హయంలో 63 శాతం పనులు పూర్తయితే టిడిపి ప్రభుత్వం 22 నుంచి 23 శాతమే చేసిందని చెప్పారు.

ఇప్పటివరకు 97 శాతం పనులు జరిగాయని, డిసెంబరులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జాతికి అంకితమివ్వబోతున్నారని చెప్పారు. నేరడి బ్యారేజీకి ఉన్న వివాదాల పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్‌తో చర్చలు జరిపారని గుర్తు చేశారు. రాష్ట్రానికి మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన మీరు ఒడిశాతో వివాదాల పరిష్కారానికి ఎందుకు ప్రయత్నించలేదన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌తో చంద్రబాబుకు ఏం సంబంధమని, టిడిపి హయాంలో పనులను ఆపేస్తే తాము వచ్చాక రూ.850 కోట్లను కేటాయించి పనులను ముమ్మరం చేశామని తెలిపారు. తోటపల్లి పనులకు 2004లో శంకుస్థాపన చేసి ఒక్క పైసా ఖర్చు చేయలేదని చెప్పారు. వైఎస్ హయాంలో 90 శాతం పనులు జరిగితే టిడిపి ప్రభుత్వం పది శాతమే పనులు చేసిందన్నారు. వంశధార నిర్వాసితులకు టిడిపి ప్రభుత్వం అన్యాయం చేస్తే తాము వచ్చాక వారికి రూ.216 కోట్లను ఎక్స్‌గ్రేషియోగా చెల్లించామని తెలిపారు. వంశధార, బాహుదా నదుల అనుసంధానం పేరుతో నాటి టిడిపి ప్రభుత్వం రూ.ఆరు వేల కోట్లను దోపిడీ చేయాలని ప్రయత్నించిందని, తాము వచ్చి నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేశామని చెప్పారు.

ఉద్దానం ప్రాంతాన్ని కిడ్నీ వ్యాధి కబలిస్తున్నా, తన హయంలో చంద్రబాబు ఏమీ చేయలేదని విమర్శించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత హిరమండలం రిజర్వాయర్ నుంచి పైప్‌లైను ఏర్పాటు చేసి గ్రామాలకు రక్షిత మంచినీటిని అందించేందుకు ట్రయల్ రన్ పూర్తి చేశామని, కొద్దిరోజుల్లో దాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత కేంద్ర ప్రభుత్వం జిల్లాకు 23 జాతీయ సంస్థలను కేటాయిస్తే జిల్లాకు ఒక్కటీ కేటాయించలేదని, ఈ ప్రాంతంపై ఉన్న ప్రేమ ఇదేనా అని ప్రశ్నించారు. జిల్లాలో రూ.నాలుగు వేల కోట్లతో మూలపేట పోర్టును నిర్మిస్తామంటే హేళన చేశారని, ఇప్పుడు పెద్దఎత్తున పనులు జరుగుతున్నాయని చెప్పారు. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, మంచినీళ్లపేటలో జెట్టీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బికెలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మిస్తున్నామన్నారు. ఆస్పత్రులు, పాఠశాలలను నాడు-నేడు నిధులతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి జరగలేదని చెప్తున్నారని, అసలు మీ దృష్టిలో అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. చంద్రబాబు చెప్పే మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు.



సమావేశంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

గ్రానైట్ క్వారీలో ప్రమాదం

- ప్రొక్లెయిన్ ఆపరేటర్ మృతి
- రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

మండలం లోని మేఘవరం పంచాయతీ నువ్వుగుడి సమీపంలోని విపిఆర్ గ్రానైట్ క్వారీలో శనివారం చోటుచేసుకున్న ప్రమాదంలో క్వారీలో ప్రొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గంగుల వెంకటరమణ (46) మృతి చెందాడు. పోలీసులు, క్వారీ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు కోటబొమ్మాళి మండలం గంగుపేటకు చెందిన వెంకటరమణ క్వారీలోని రాక్ కటింగ్ చేసిన అనంతరం దాన్ని ప్రొక్లెయిన్‌తో కదిలించే క్రమంలో ఒక్కసారిగా గ్రానైట్ రాక్ అదుపుతప్పి ప్రొక్లెయిన్ మీద పడింది. దీంతో ఆపరేటర్ వెంకటరమణ క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. దీన్ని గమనించిన తోటి కార్మికులు అతి కష్టం మీద రమణమూర్తిని క్యాబిన్ నుంచి బయటకు తీసి హుటాహుటిన టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో వెంకటరమణ రెండు కాళ్లూ నుజ్జునుజ్జు కావడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబసభ్యులకు ఆస్పత్రికి వద్దకు చేరుకుని మృతదేహం వద్ద భోరున విలపించారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ మృతదేహాన్ని, ఘటనా స్థలంలో ప్రమాదం సంభవించిన తీరును పరిశీలించారు. మృతునికి భార్య సరళ, కుమారుడు శ్రీరామ్, కుమార్తె కీర్తన ఉన్నారు. వెంకటరమణ మృతితో గంగుపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.



వెంకటరమణ (ఫైల్)



ప్రొక్లెయిన్‌పై పడిన గ్రానైట్ రాక్

మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలి

ప్రొక్లెయిన్ ఆపరేటర్ వెంకటరమణ కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు డిమాండ్ చేశారు. ప్రమాద ఘటన తెలుసుకుని జిల్లా కేంద్రాస్పత్రికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రానైట్ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని చెప్పారు.

నేడు యోగా పోటీలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పిఎన్ కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్‌లో నేషనల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఆదివారం యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. యోగా పోటీల్లో పాల్గొనాలనుకునే ఔత్సాహికులు ఉదయం తొమ్మిది గంటలకు న్యూసెంట్రల్ స్కూల్ వద్దకు చేరుకోవాలన్నారు. ఈ పోటీలు సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించనున్నామని తెలిపారు.



యువతను ప్రోత్సహించడానికే 'విద్యా సంకల్పం'

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, టెక్కలి

జిల్లాలో ఎంతోమంది ప్రతిభ గల యువతీ యువకులకు సరైన మార్గనిర్దేశం కాక ఆర్థిక ఇబ్బందుల కారణంగా పోటీ పరీక్షల్లో రాణించలేకపోతున్నారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. అటువంటి వారిని ప్రోత్సహించడమే ఎర్రన్న విద్యా సంకల్పం లక్ష్యమన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఒక హోటల్‌లో, టెక్కలిలోని ఒక కళ్యాణ మండపంలో విద్యా సంకల్పం ద్వారా పలు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్స్, పోలీస్ తదితర అంశాల్లో ఉద్యోగార్థులకు పోటీ పరీక్ష నిర్వహించి జిల్లావ్యాప్తంగా 700 మందికి పుస్తకాలతో పాటు 21 మందికి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి, కలమట వెంకటరమణ, నాయకులు చౌదరి నారాయణమూర్తి, బోయిన గోవిందరాజులు, కింజరాపు హరివరప్రసాద్ తదితరులున్నారు.



పుస్తకాల కిట్లు అందజేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

దేశ పరిణామాలపై గొంతెత్తాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలపై స్పందించి గొంతెత్తడం కవులు, రచయితల బాధ్యత అని కవి చింతాడ తిరుమలరావు అన్నారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన రగులుతున్న 'దేశమా నీ పయనమెటు' అనే అంశంపై శనివారం కవితా గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో మత చిచ్చు రగిల్చిన మతోన్మాద శక్తులు చెలరేగి మహిళలను నడివీధుల్లో నగ్నంగా నడిపించి దేశ ప్రతిష్టను దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితులను చూస్తూ సహించి మౌనంగా ఉండడం మేధావులకు తగదన్నారు. ప్రజా చైతన్యాన్ని రగిల్చే కృషిలో కవులు, రచయితలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన కవితా గోష్టిలో పలువురు కవులు తమ స్వీయ కవితలను చదివి వినిపించారు. మంటల జాతర, భూకంప సంకేతం, శఠగోపం, డా.నీరో మోడీ అనస్తటిస్ట్ విస్పష్ట గమనం, దేశమా నీ పయనమెటు, ఖబడ్దార్, అసంకల్పిత తిరుగుబాటుతత్వం అనే కవితల్ని రచయితలు బాడాన శ్యామలరావు, నెట్టిమి రమణారావు, కె.శ్రీనివాసు, వి.జి.కె మూర్తి, కంచరాన భుజంగరావు, తంగి ఎర్రమ్మ, చింతాడ కృష్ణారావు పఠనం చేశారు. కార్యక్రమంలో చింతాడ రామచంద్రరావు సినారె గజల్‌ను గానం చేశారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పి.సుధాకరరావు, ఆర్.మధుసూదనరావు, డి.సూర్యతేజ, ఎం.గోవర్ధనరావు, కె.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుమలరావు

ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ బాధ్యతల స్వీకరణ

టెక్కలి : టెక్కలి ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా డి.సీతారామస్వామి శనివారం బాధ్యతలు స్వీకరించారు. పలాస ఆర్‌డిఒగా పనిచేస్తున్న ఆయన ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన నేపథ్యంలో ఆయనకు బాధ్యతలు అప్పగించారు. సీతారామస్వామికి కార్యాలయ ఎఒ రాజగోపాల్, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులపై మాటల యుద్ధం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనతో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల బండారం బయటపడింది. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్రాన్ని ఏలిన, ఏలుతున్న పార్టీ ప్రజలకు ఏం ఒరగబెట్టారో తేటతెల్లమైంది. సాగునీటి ప్రాజెక్టులపై యుద్ధభేరిలో భాగంగా వంశధార ప్రాజెక్టు, వంశధార, నాగావళి నదుల అనుసంధాన పనుల పరిశీలనకు వచ్చి వెళ్లిన తర్వాత ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. చంద్రబాబు మాటలకు జిల్లాకు చెందిన మంత్రులు కౌంటర్ ఎటాక్ ఇవ్వడంతో అసలు వాస్తవాలు ప్రజలకు తెలుస్తున్నాయి. కొత్తూరు బహిరంగ సభ, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో టిడిపి హయాంలోనే పనులు జరిగాయని, వైసిపి వచ్చిన తర్వాత పెద్దగా పనులేమీ జరగలేదంటూ చంద్రబాబు చెప్పుకొచ్చారు. వంశధార ప్రాజెక్టుకు తాము రూ.872 కోట్లు ఖర్చు పెడితే, వైసిపి ప్రభుత్వం రూ.353 కోట్లే వెచ్చించిందని చెప్పారు. వంశధారతో పాటు టిడిపి హయాంలో జరిగిన అన్ని ప్రాజెక్టుల పనులనూ లెక్కలతో సహా మీడియాకు వివరించారు. వైసిపి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నాశనం చేసిందంటూ దుమ్మెత్తిపోశారు. దీనిపై జిల్లాకు చెందిన మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు చంద్రబాబుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వంశధార, ఆఫ్‌షోర్, తోటపల్లి ప్రాజెక్టులతో చంద్రబాబుకు సంబంధమేమిటని, జలయజ్ఞంలో భాగంగా నాడు వైఎస్ జిల్లాకు కేటాయిస్తే, దాన్ని పూర్తి చేసే పనిని జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నారంటూ కౌంటర్ ఎటాక్ ఇచ్చారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చూపింది చంద్రబాబేనంటూ దుయ్యబట్టారు. సాగునీటి ప్రాజెక్టులపై ఒకరినొకరు దూషించుకుంటున్న నేతలు అసలు వాస్తవాలను విస్మరిస్తున్నారు.

వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 స్టేజ్-2 నిర్మాణ పనులను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2006లో రూ.935 కోట్లతో ప్రారంభించింది. ఆ సమయానికి ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నారు. ఒప్పందం ప్రకారం 24 నెలల్లో అంటే 2008 నాటికి పూర్తి కావాల్సి ఉంది. 2014 వరకు పనులు 60 శాతం వరకు జరిగినా ఆర్ అండ్ ఆర్, యూత్ ప్యాకేజీ వంటి సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయి. వైఎస్ తర్వాత బాధ్యతలు చేపట్టిన తర్వాత రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో పనులు పెద్దగా ఏమీ జరగలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం అంచనా వ్యయాన్ని రూ.1616 కోట్లకు పెంచి కొత్త కాంట్రాక్టు నిర్మాణ సంస్థకు అప్పగించింది. ఐదేళ్ల కాలంలోనూ దాన్ని పూర్తి చేయలేకపోయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అంచనా



వ్యయాన్ని రూ.2407 కోట్లకు పెంచింది. ఇప్పటికీ 87 ప్యాకేజీ పనులు 83 శాతమే జరిగాయి. రూ.935 కోట్లతో పూర్తి కావాల్సిన వంశధార ప్రాజెక్టు రూ.2,407 కోట్లకు చేరిందంటే, అప్పట్నుంచి ఇప్పటివరకు రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్, టిడిపి, వైసిపి ప్రభుత్వాల వైఫల్యం కాదా?. సుమారు రూ.1500 కోట్ల ప్రజాధనం వృధా అయ్యిందంటే ఎవరు బాధ్యత వహిస్తారు?. వంశధార ప్రాజెక్టును తమ ఖాతాలో వేసుకోవాలని పోటీ పడుతున్న నేతలు ఇప్పటికైనా వాస్తవాలను గుర్తెరిగి ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయడంపై దృష్టి సారించాల్సి ఉంది.

వచ్చే ఏడాది ఎన్నికల నేపథ్యంలో వంశధార నిర్వాసితులను తమవైపు తిప్పుకునేందుకు టిడిపి, వైసిపి మరోసారి పోటీ పడుతున్నాయి. మీరు అన్యాయం చేశారంటే, మీరే మోసగించారంటూ ఇరువురూ ఒకరిపై ఒకరు పరస్పరం విమర్శలు గుప్పించుకుంటున్నారు. కొత్తూరు మండలం గూనభద్ర, కొత్తూరు బహిరంగ సభలో వంశధార నిర్వాసితుల అంశాన్ని చంద్రబాబు ప్రత్యేకించి ప్రస్తావించారు. టిడిపి హయాంలో నిర్వాసితులకు యూత్ ప్యాకేజీ కింద రూ.5 లక్షల ఇచ్చామని చెప్పుకొచ్చారు. నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేయకుండా జగన్ మోసం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే ప్రత్యేక ప్యాకేజీని తీసుకొచ్చి రైతాంగాన్ని ఆదుకుంటామంటూ హామీనిచ్చారు. దీనిపై జిల్లాకు చెందిన ఇరువురు మంత్రులూ కౌంటర్ ఎటాక్ ఇచ్చారు. నిర్వాసితులకు అన్యాయం చేసింది చంద్రబాబేనని, నిర్వాసితుల కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రూ.216 కోట్ల అదనపు పరిహారం ఇచ్చారని చెప్పుకొచ్చారు. యూత్ ప్యాకేజీ కోసం 2016లో జిఒ ఇచ్చిన చంద్రబాబు అప్పుడెందుకు 2013 భూసేకరణ చట్టం అమలు చేయలేదని ఎదురు ప్రశ్నించారు.

నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేయకుండా అన్యాయం చేయడంలో రెండు పార్టీలూ దోషులేనని వారి మాటలను విన్న జనం చర్చించుకుంటున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి నిర్వాసితుల సమస్యలను పక్కన పెట్టి పనులు చేపడుతుండడంతో, వంశధార నిర్వాసితుల సంఘం అందరినీ ఏకం చేసి రకరకాల రూపంలో ఆందోళనలు చేసింది. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో ప్రభుత్వం దిగొచ్చి యూత్ ప్యాకేజీ డబ్బులను విడుదల చేయడంతో పాటు రైతులకు చంద్రబాబు క్షమాపణలు చెప్పారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2013 చట్టం అమలు హామీని విస్మరించడంతో నిర్వాసితుల సంఘం మరోసారి ఆందోళనలు నిర్వహించడంతో గతేడాది జూన్‌లో వైసిపి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియో కింద రూ.216 కోట్లను విడుదల చేసింది. తాము యూత్ ప్యాకేజీ ఇచ్చామని చంద్రబాబు, వైసిపి ప్రభుత్వం అదనపు పరిహారం ఇచ్చిందంటూ మంత్రులు చెప్తున్నా, అవి పోరాడితే గానీ రాలేదన్న వాస్తవం అందరికీ తెలుసునన్న విషయం అధికార, ప్రతిపక్ష పార్టీలు గుర్తిస్తే మంచిది.

పర్యావరణ పరిరక్షణకు కృషి

'నాభూమి- నా దేశం'లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ● విస్తృతంగా మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు



ఆమదాలవలస : నాభూమి-నాదేశం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి-మెళియాపుట్టి

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. మండలంలోని పట్టుపురం గ్రామంలో నా భూమి -నా దేశం కార్యక్రమంలో భాగంగా నూతన సచివాలయ ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కల పెంపకం తోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. దేశ రక్షణకు ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజినీ, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎపిఎం లలిత, సర్పంచ్ సంపతిరావు లక్ష్మి పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో నా భూమి - నా దేశం కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు చేపట్టారు. నా భూమి- నా దేశం కార్యక్రమంలో భాగంగా అమరవీరుల శిలాఫలకాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం ఆవిష్కరించారు. అమరవీరుల కుటుంబ సభ్యులు అమ్మనమ్మ, టి.మల్లేశ్వరరావును స్పీకర్ సత్కరించారు. అమరవీరుడు తోలాపి గోవిందరావు తండ్రి మల్లేశ్వరరావు మాట్లాడుతూ సొట్టవానిపేట ఇందిరమ్మ కాలనీకి తన కుమారుడి పేరు పెట్టారని ప్రభుత్వం తరఫున బోర్డు ఏర్పాటుచేయాలని కమిషనర్ రవి సుధాకర్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్, ఎ.ఉమా మహేశ్వరరావు, ఎఇ సృజన, మాజీ సైనికుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు కటకం పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : డోకులపాడు పంచాయతీలో భరతమాత, గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు సర్పంచ్ వడ్డి సరిత పూలమాల వేసి నివాళు లర్పించారు. శిలాఫలకాలన్ని ఆవిష్కరించారు. అమరవీరుల సంస్మరణార్థం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి వడ్డి కరుణాకర్, ఎపిఒ కేశవ, ఎంపిటిసి భాగ్యలక్ష్మి డిల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి యాదవ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జి.సిగడాం : ఎస్‌పిఆర్‌పురంలో సర్పంచ్ కంది రమాదేవి ఆధ్వర్యాన నా మట్టి- నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కూనిబిల్లి కోటేశ్వరావు, ఇసి గేదెల పురుషోత్తం, కంది సాయి, ఎపిఎం రెడ్డి రామకృష్ణం నాయుడు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని మాకన్నపల్లిలో స్వాతంత్ర సమరయోధులకు ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు ఘనంగా నివాళులర్పించారు. ముందుగా జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సైని దేసయ్య, ఇఒపిఆర్‌డి మెట్ట వైకుంఠరావు, కోరాడ ధనరాజ్, రాపాక చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని పెదలింగాలవలసలో నాభూమి-నాదేశం కార్యక్రమాన్ని సర్పంచ్ లుకలాపు యశోద నిర్వహించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని వైసిపి సీనియర్ నాయకులు లుకలాపు అప్పలనాయుడు ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లుకలాపు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మడ్డి రమణ, మాజీ ఎంపిటిసి లంక రాంబాబు, ఫీల్డ్‌అసిస్టెంట్ బి.సత్యం, సిబ్బంది సిహెచ్ రవి పాల్గొన్నారు .

రణస్థలం : మండలంలో నా భూమి- నా దేశం కార్యక్రమంలో భాగంగా వల్లభరావుపేటలో మహిళా అధ్యక్షులు మానస చిరంజీవి, తిరుపతిపాలెంలో సర్పంచ్ ఆకుల రవి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు మహంతి సత్యనారాయణ, గడి బలరాం, ఎపిఒ శ్రీనివాసనాయుడు, జెఇ గౌరీశంకర్, ఆకుల గోపి, మండల రవి, వాళ్లే హరిబాబు, మండల అసిరినాయుడు, కార్యదర్శి గోవిందరావు పాల్గొన్నారు.

పోలాకి : సంతలక్ష్మీపురంలో నాభూమి- నాదేశం కార్యక్రమాన్ని సర్పంచ్ యారబాటి నీలవేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వై.వెంకటరమణ పాల్గొన్నారు.

నందిగాం : మండలంలో నందిగాంంలో నాయకులు జడ్యాడ జయరాం ఆధ్వర్యంలో నిర్వహించిన 'నా భూమి - నా దేశం కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు పాల్గొన్నారు. జాతీయ నాయకులను, అమరవీరులను స్మరిస్తూ నివాళులర్పించారు. జాతీయ జెండా ఆవిష్కరించారు. కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివప్రసాద్,. ఎంపిటిసి అంబోడి విష్ణు, నాయకులు చిన్ని జోగారావు యాదవ్, ఎపిఒ నాగరాజు పాల్గొన్నారు.

కవిటి : కవిటి గ్రామంలో నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని సర్పంచ్ పూడి లక్ష్మణరావు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి అందరితో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఇఒ వీరభద్ర స్వామి, నాయకులు పూడి నీలాచలం, పాండవ శేఖర్, బెందాళం రమణమూర్తి, డి.దుర్యోధన, డి.ధర్మారావు, విఆర్ఒ నారాయణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్ కోరారు. మండలంలో కొఠారి పంచాయతీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో వివేకానంద రెడ్డి, ఉప్పాడ రాజారెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : నా భూమి - నా దేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దరోకళ్లపల్లిలో ఎంపిడిఒ హనుమంతు వెంకటరమణ మూర్తి మొక్కలు నాటారు. బొప్పాయిపురం, అయోధ్యపురం, నర్సింగపల్లి, అక్కవరం పంచాయతీల్లో మెక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచులు రాంపాత్రుని అనూష, గుజ్జు మోహన్‌రెడ్డి, బగాది హరి, రౌతు జయమోహన్, పొట్నూరు భూలక్ష్మి అప్పలనాయుడు, మక్క రాజేశ్వరరెడ్డి, పాల రవికుమార్ రెడ్డి, వర్దన్, వైకుంఠరావు పాల్గొన్నారు.



మెళియాపుట్టి : మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



చివరి దశకు వంతెన పనులు

ప్రజాశక్తి-ఇచ్ఛాపురం

బాహుదా నదిపై తాత్కాలిక వంతెన పనులు చివరిదశకు చేరాయని ఆర్‌అండ్‌బి ఇంజినీరింగ్ అధికారి మోహనరావు తెలిపారు. మే 3న భారీ వాహనం బాహుదా వంతెనపై నుంచి వెళ్లడంతో కుప్ప కూలిన విషయం తెలిసిందే. కూలిన వంతెన వల్ల ఇచ్ఛాపురానికి రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఎదురయ్యాయి. కలెక్టర్ చొరవ తీసుకుని, కూలిన వంతెన స్థానంలో తాత్కాలిక వంతెన నిర్మించాలని అధికారులను ఆదేశించారు. వంతెన నిర్మాణ పనుల్లో సాంకేతిక సమస్యలు వచ్చినా, పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని మోహనరావు తెలిపారు. దీని మీద తారురోడ్డు వేసి నిర్మాణం పూర్తిచేస్తామన్నారు.

వెనుకబడిన తరగతులకు ప్రాధాన్యత పెంచాలి

ప్రజాశక్తి - పొందూరు

వెనుకబడిన తరగతులవారికి ప్రభుత్వంలో, ఇతర రంగాలలో ప్రాధాన్యతను మరింతగా పెంచాలని ఎబిసిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పల రామ్మోహన్ కోరారు. జ్యోతిరావుపూలే గురుకుల బాలికల జూనియర్ కళాశాల ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీకాకుళం వచ్చిన మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను శనివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెనుకబడిన తరగతుల సమస్యలపై ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మంత్రిని, స్పీకర్ తమ్మినేని సీతారాంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బిసి ఫెడరేషన్ నాయకులు బొడ్డేపల్లి దామోదరరావు, కె.వెంకటరావు, పి.మల్లేశ్వరరావు, కెవిఎస్ నాయుడు. పి.అప్పలనాయుడు, పి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం

ప్రజాశక్తి-పలాస

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు గోరు వాసుదేవరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి అన్నారు. కాశీబుగ్గ హైస్కూల్ మైదానంలో ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ముందుగా ఎఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ ఒడి పేరుతో విద్యార్థులకు ప్రతి ఏటా కోతలు విధిస్తూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు గుణశేఖర్, పవన్, మణి, సాయి పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఈ నెల 14న విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఇఇ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి పార్వతీశంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకయ్యపేట, అక్కులపేట ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగిస్తున్నట్లు చెప్పారు. దీంతో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఓటరు సర్వే వేగవంతం

ప్రజాశక్తి-జలుమూరు

ఓటర్ సర్వేను వేగవంతం చేసి 18వ తేదీకి పూర్తి చేయాలని తహశీల్దార్ బి.సత్యం.. బిఎల్‌ఒలను ఆదేశించారు. శనివారం మండలంలోని 41, 67, 68 పోలింగ్ స్టేషన్లో పరిధిలో చేపడుతున్న ఇంటింటి ఓటరు సర్వేను ఆయన పరిశీలించారు. ఓటరు సర్వే పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. కార్డులో తప్పులను సవరించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ పరిశీలకులు సతీష్, విఆర్‌ఒలు అర్జునరావు, జ్యోతి, పంచాయతీ కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాములమ్మ

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-సంతబొమ్మాళి

జగన్నాథపురంలో అంగన్వాడీ కేంద్రాల్లో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు సర్పంచ్ జోగి రాములమ్మ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్యకార సొసైటి అధ్యక్షులు పుక్కళ్ల లక్ష్మణరావు, వైసిపి నాయకులు లండ రామారావు, అంగన్‌వాడీ కార్యకర్త వి.వి.పద్మ పాల్గొన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-టెక్కలి

రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర నాయకులు తలసముద్రం సూర్యం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

రామచంద్రపురంలో పొలంబడి

ప్రజాశక్తి-మెళియాపుట్టి

మండలంలోని రామచంద్రపురంలో విఎఎ నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎఒ దానకర్ణుడు రైతులకు పలు సూచనలు చేశారు. సదుపాయకర్త చిన్నింటి అప్పారావు పొలంలో కాలిబాటలు తీసే విధానం, వాటి వల్ల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడ వసంతకుమారి పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో కరాటే కళ్యాణి

ప్రజాశక్తి - కవిటి

కవిటి గ్రామంలోని చింతామణి అమ్మవారి ఆలయంలో సినీనటి కరాటే కళ్యాణి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి చేరుకున్న కళ్యాణికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ మర్యాదలతో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాండవ శేఖర్, ఆరింగి మధు, ఆరింగి వెంకటరావు, పొల్లాయి లక్ష్మణమూర్తి, పొల్లాయి ఉమామహేశ్వరరావు, టి మోహనరావు, దాసు రౌలో, పొల్లాయి అశోక్, ఎం సంతోష్, సాగర్ పాల్గొన్నారు.

విఆర్‌ఎ అప్పారావు మృతి

ప్రజాశక్తి-నందిగాం

మండలంలోని ఆకులరఘునాథపురం విఆర్‌ఎ బరడ అప్పారావు (55) శనివారం అనారోగ్యంతో నందిగాంలో స్వగృహంలో హఠాన్మరణం చెందారు. ఆయనకు భార్య చిన్నమ్మ, కుమారుడు రమేష్ ఉన్నారు. అప్పారావు కుటుంబాన్ని మాజీ జెడ్‌పిటిసి కె.బాలకృష్ణారావు, జెసిఎస్ కన్వీనర్ జె.జయరాం, మండల సర్వేయర్ కె.జోగారావు, విఆర్‌ఎల సంఘం ప్రతినిధులు రాములమ్మ, గణపతిరావు పరామర్శించారు.

నేడు 'పట్టుశాలి' ఆత్మీయ సమావేశం

శ్రీకాకుళం : శ్రీకాకుళంలోని గైనేటి వీధిలో పట్టుశాలి కళ్యాణవ మండపంలో కుల బంధువుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు పట్టుశాలి సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు గుంటుకు చంద్రశేఖర్, కార్యదర్శి పి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

గుర్రపుడెక్కతో రైతులు విలవిల

వంశధార అధికారులను నిలదీత

ప్రజాశక్తి-సంతబొమ్మాళి

ఆగస్టు వస్తే వంశధార అధికారులు వచ్చి హడావుడి చేసి వెళ్లి పోతారు తప్ప రైతులకు ఉపయోగం లేదని జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, నాయకులు గొరుసు సవరయ్య, బుస్కల లక్షుమయ్య, బొంగు కొండయ్య, అట్టాడ అప్పలనాయుడు.. డిఇ సత్యనారాయణ, జెఇ అప్పలరెడ్డిని శనివారం నిలదీశారు. శనివారం బోరుభద్ర జిజి ఛానల్ నుండి పాలతలగాంలోని నూకలకనత వరకు సుమారు 6 కిలోమీటర్ల కాలువను అధికారులు, రైతులతో కలిసి వారు పరిశీలించారు. గట్టుపై నడుస్తూ గుర్రపుడెక్క పేరుకుపోవడం చూసి చలించిపోయారు. ఎండిపోతున్న పంటపొలాలు చూసి వంశధార అధికారులను గట్టిగా నిలదీశారు. బోరుభద్ర, కొల్లిపాడు, మేఘవరం, మరువాడ, కె.లింగూడు, మూలపేట పంచాయతీలకు నేటికీ సాగునీరు అందించని అధికారులు ఎందుకని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాలువలో గుర్రపుడెక్క తొలగించాలంటే ఏప్రిల్, మే నెలల్లో పని చేయాలని, కానీ ప్రతి ఏటా ఆగస్టులో హడావుడి చేయడం వల్ల ప్రయోజనం లేదని నిలదీశారు. రైతులకు ఎటువంటి అన్యాయం జరిగినా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్క బీమారావు, పరపటి శ్రీనివాస్, చింతాడ చిన్నారావు, రైతులు తిప్పాన రమణ, బర్ల రమణ, చలపతి, ముద్ద ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.



బోరుభద్ర వద్ద వంశధార కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి, రైతులు

మానవాళి మనుగడకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-పలాస

మానవాళి మనుగడకు మొక్కలు నాటాలని వైసిపి జిల్లా కార్యదర్శి ఉంగ సాయికృష్ణ కోరారు. మండలంలోని టెక్కలిపట్నం గ్రామంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పానిల కృష్ణారావు, కోరాడ కరుణ కుమార్, రంగారావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో సిక్కోలుది కీలకపాత్ర

మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి-పలాస

స్వాతంత్ర్య ఉద్యమంలో సిక్కోలు నేతలు కీలకపాత్ర పోషించారని పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. కాశీబుగ్గలోని ప్రయివేటు కళ్యాణ మండపంలో శనివారం 'స్వాతంత్ర్యోద్యమంలో సిక్కోలు వీరులు' అనే పుస్తకాన్ని వాణిజ్య పన్నుల శాఖ మాజీ డిప్యూటీ కమిషనర్ జుత్తు తాతారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులను అన్వేషించి పుస్తకాన్ని రచించిన కుత్తం వినోద్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో కుత్తం హేమావతి, డాక్టర్ జి.లీలవరప్రసాద్ రావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోదండ కృష్ణ, సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షులు రాపాక ధనరాజు, వంకల రాజారావు, బత్తిని లక్ష్మణ్, కుత్తం అజయ్‌కుమార్, పోతనపల్లి కుసుమ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, జుత్తు రామారావు, తదితరులు

ఇంటింటికీ తాగునీరు

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి-పొందూరు

నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్య మని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరు మండలం దల్లిపేట పంచాయతీ రెడ్డిపేటలో సర్పంచ్ కంబాపు నీలవేణి ఆధ్వర్యంలో శనివారం జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.40 లక్షలతో ఇంటింటికీ కొళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగేళ్లలో అందజేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, కిల్లి నాగేశ్వరరావు, కంబాపు సూర్యారావు, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, తహశీల్దార్ వై.వి.ప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

వైసిపిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు తెలిపారు. శనివారం స్థానిక టిడిపి మండల కార్యాలయంలో పార్టీ సర్వసభ్య సమావేశాన్ని పార్టీ వ్యవహారాల సమన్వయకర్త వై.వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ భవిష్యత్తు గ్యారంటీ, మహిళా మహాశక్తి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకొని వెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్, మాజీ ఎంపిపి జి.వసంతస్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, పి.సాంబమూర్తి, ఎన్.సూర్యనారాయణ, కణితి సురేష్, సూల చిట్టిబాబు, జోగి తిరుపతిరావు, ఎ.ఉమామహేశ్వరరావు, తమ్మినాన గోపాలరావు, దుంపల వల్లభరావు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

106 మంది రక్తదానం

ప్రజాశక్తి - కొత్తూరు

స్థానిక గోగుల కాంప్లెక్స్‌లో శనివారం భగత్ సింగ్ ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 106 మంది యువకులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ భగత్ సింగ్ ట్రస్టు సేవలను కొనియాడారు. కర్లేమ్మ పంచాయతీ నేతాజీనగర్ కాలనీకి చెందిన సింహాద్రి ఆకాంక్ష కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో ఆ కుటుంబానికి రూ.35 వేలు, గునభద్రకు చెందిన పి.శ్రావణి కుమార్తె తలసేమియా వ్యాధితో బాధపడుతుండటంతో రూ.35 వేలను ట్రస్టు సభ్యులు అందజేశారు. కిడ్నీవ్యాధితో బాధపడుతున్న కోటబొమ్మాళి మండలం వాంద్ర గ్రామానికి చెందిన పట్టా జగ్గారావుకు రూ.20 వేలు అందించారు. కార్యక్రమంలో వైద్యులు ఎ.అప్పలనాయుడు, సామాజికవేత్త పోతురాజు శ్రీధర్, పెంకి చైతన్య, ఎన్.జగదీష్, లోకేష్, గోగుల బుజ్జి, పొగిరి వినోద్, డి.రాజేష్, సాయి, సారిపల్లి వెంకటేష్, సిహెచ్.బాలకృష్ణ, పి.రవి, శివ, రవీంద్ర, ఇస్సాయి శివ, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి

విఒఎలకు కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-టెక్కలి రూరల్

విఒఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, విఒఎల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జి.అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం టెక్కలిలో ఎస్.లక్ష్మి అధ్యక్షతన విఒఎల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఒఎల ఉపాధిని దెబ్బతీసే మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దుచేయాలన్నారు. గ్రామ సమాఖ్యల విలీనం ఆపాలని, దీనివల్ల వేలాది మంది విఒఎలకు ఉపాధి పోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఎక్కువ సంఘాలున్న విఒఎల నుండి తక్కువ సంఘాలున్న విఒఎలకు సర్దుబాటు చేయాలని, అందులో రాజకీయ జోక్యం ఉండకూడదని డిమాండ్ చేశారు. విఒఎగా ఉపాధి కోల్పోయిన వారందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో అసిరినాయుడు, గంగయ్య, మహాలక్ష్మి, మన్మధరావు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులను విస్మరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-పలాస

కిడ్నీ వ్యాధితో యువత మృత్యువాత పడుతున్నారని, కిడ్నీ వ్యాధిగ్రస్తులను ప్రభుత్వం విస్మరించిందని కౌలురైతు సంఘం జిల్లా నాయకులు బమ్మిడి ఆనంద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని గొల్ల మాకన్నపల్లి గ్రామానికి చెందిన రాపాక చినవెంకటరావు, మందస మండలం వరద రాజపురం గ్రామానికి చెందిన కొత్తపల్లి స్పందన ఇటీవల కిడ్నీ వ్యాధితో మరణించారు. విషయం తెలుసుకున్న బమ్మిడి ఆనంద్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు బొడ్డు వాసుదేవరావు, సిపిఎం నాయకులు ఎన్.మోహనరావు ఆ కుటుంబాలను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిడ్నీ రోగులను అందుకుంటున్నామని, రూ.10 వేలు పింఛను ఇస్తున్నామని గొప్పలు చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సక్రమంగా అందడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి కిడ్నీ వ్యాధితో మృతి చెందిన కుటుంబాలకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



కిడ్నీ వ్యాధితో మృతి చెందిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలి

కవిటి : ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు అన్నారు. ఉద్దానం కిడ్నీ సమస్య శాశ్వత పరిష్కారం కోసం జనసేన ఆధ్వర్యంలో శనివారం కవిటి మండలంలోని రాపాకపుట్టుగ, శసానపుట్టుగ, ఇంటేనుకపుట్టుగ, లండారిపుట్టుగ, తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా దాసరి రాజు మాట్లాడుతూ చిత్తశుద్ధితో పనిచేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని, దాన్ని జనసేన చేసి చూపిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహర, డొక్కరి ఈశ్వరరావు, రోకళ్ళ భాస్కర్, అంగ సురేష్, ధనుంజయం, వల్లభ, ఎం.ఈశ్వరరావు, డి.భాస్కర్ పాల్గొన్నారు.

మత్స్యకారుని కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి -రణస్థలం

సముద్రపు వేటకు వెళ్లి మరణించిన మత్స్యకారుడు మైలపల్లి అప్పన్న కుటుంబాన్ని ఆదుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొవ్వాడ మత్స్యలేశంలో బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా తక్షణమే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. మత్స్యకారులకు లైఫ్‌గార్డులను అందజేయాలన్నారు. అనంతరం అదే గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన చీకటి ఎర్రమ్మ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

వైసిపి నాయకుల పరామర్శ

మండలంలోని కొవ్వాడలో బోటు ప్రమాదంలో మరణించిన మైలపల్లి అప్పన్న కుటుంబాన్ని వైసిపి నియోజకవర్గ నాయకులు లుకలాపు అప్పలనాయుడు శనివారం పరామర్శించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలను వర్తింపజేయాలని అధికారులను ఆయన కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పెరుమాళ్ల రమణ, పట్నాన పారంనాయుడు, పతివాడ గురునాయుడు పాల్గొన్నారు.



చోరీ చేసిన వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నంబరు మార్చారు... తనిఖీల్లో దొరికారు

చోరీకి గురైన 10 బైకులు, రెండు ఆటోలు స్వాధీనం

ప్రజాశక్తి - కొత్తూరు

చోరీ చేసిన ద్విచక్ర వాహనాలకు నంబరు ప్లేటు మార్చి తిరుగుతుండగా, పోలీసుల తనిఖీల్లో అసలు గుట్టు బయటపడింది. దీంతో వారిని విచారించగా పది ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు చోరీ విషయం వెల్లడైంది. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎస్ఐ ఎం.గోవింద్ శనివారం వాహన తనిఖీలు చేస్తున్నారు. మండలంలోని గురండికి చెందిన అలికాన వంశీ ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా వాహనంపై ఉన్న నంబరు, ఆన్‌లైన్‌లో ఉన్న నంబరు వేర్వేరుగా ఉన్నాయి. దీంతో వంశీని విచారణ చేయగా, అసలు వాస్తవాలు వెలుగు చూశాయి. గురండికి చెందిన ఆటోడ్రైవర్ పాగోటి వినయ్, అదే గ్రామానికి చెందిన మెకానిక్‌గా పనిచేస్తున్న బాలుడు వాహనాలు చోరీ చేస్తున్నట్లు వంశీ తెలిపాడు.

ఒడిశా రాష్ట్రం కాశీనగర్, కిడిగాం, సీతాపురంలోలో లగేజీ ఆటో, ప్రయాణికుల ఆటో, బుల్లెట్, టివిఎస్ బైక్‌లు చోరీ చేశారు. జలుమూరు మండలంలో ఒకటి, పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం బత్తిలిలో ఒకటి, కొత్తూరులో ఒక బైక్ చోరీకి పాల్పడినట్లు తెలిపాడు. వీటితో పాటు రెండు బ్యాటరీలు, ఒక మోటార్‌ను చోరీ చేశారు. చోరీ చేసిన వాహనాల నంబర్లు మార్చి ఇతరులకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.పది లక్షలు ఉంటుందని అంచనా వేశారు. చోరీ చేసిన ద్విచక్ర వాహనాలు, ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ఘనంగా రంగనాథన్ జయంతి

ప్రజాశక్తి-లావేరు

లావేరు శాఖా గ్రంథాలయంలో శనివారం ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రంగనాథన్ జయంతిని జాతీయ లైబ్రేరియన్ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

టెక్కలి : గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగులు తమిరె వైకుంఠరావు, గున్న ప్రసాదరావు, కె.బి.సుబ్రహ్మణ్యం, ఎస్.రామారావును శనివారం టెక్కలి గ్రంథాలయంలో సత్కరించారు. గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్.ఆర్. రంగనాథన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి బి.రూపావతి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు ఎస్.ఉదయ్‌కిరణ్, ఎస్.ఆమ్మనమ్మ, కె.తారక్ పాల్గొన్నారు.



విద్యుత్ షార్ట్‌సర్క్యూట్

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ సూదికొండ కాలనీలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న న్యూట్రల్ వైర్ తెగిపోవడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని 40 ఇళ్లలోని వస్తువులు, బల్బులు, విద్యుత్ మీటర్లు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ఈ సంఘటనలో పైలట్ వాటర్ స్కీమ్ ట్యాంకు వద్ద విద్యుత్ వైర్లు కాలి బూడిదైంది. ఇటీవల ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి వైర్లను సరిచేస్తున్నారు. మంచినీటి సరఫరా చేసే పవర్ బోరు మోటారు వైర్లు కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది.



నాట్లు వేస్తున్న విద్యార్థులు

నాట్లు వేయడంపై అవగాహన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీ లోని ఆర్స్‌ఫర్డు స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు వరి నాట్లపై అవగాహనా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎచ్చెర్ల మండలం పొన్నాడ సమీపంలోని పంట పొలాల్లో రైతులతో కలిసి వరి నాట్లు వేశారు. రైతుల సూచనల మేరకు వరి మొనలను పొలంలో నాటుతూ ప్రత్యక్ష అనుభవాన్ని పొందారు. వ్యవసాయంలో ఒక భాగమైన వరి మొనలను నేరుగా పొలంలో దిగి వేయడం తమకు మంచి అనుభూతిని ఇచ్చిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల డైరెక్టర్ అన్నెపు లావణ్యరాణి, ప్రిన్సిపల్ బి.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

హోంగార్డులకు రైన్ కోట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వర్షాకాలంలో విధి నిర్వహణలో హోంగార్డులకు ఎంతగానో ఉపయోగపడే రైన్ కోట్లను ఇవ్వడానికి డాక్టర్ దానేటి శ్రీధర్ ముందుకు రావడం ఎంతో అభినందనీయమని ఎస్‌పి జి.ఆర్ రాధిక కొనియాడారు. డాక్టర్ దానేటి శ్రీధర్ ఆర్థికసాయంతో కొనుగోలు చేసిన 300 రైన్ కోట్స్‌ను ఎస్‌పి చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థికస్తోమత లేని హోంగార్డు పిల్లలు డిగ్రీ తదితర ప్రొఫెషనల్ కోర్సులు చదువుకోడానికి డాక్టర్ శ్రీధర్‌ను సంప్రదిస్తే ఆర్థిక సహకారం చేయడానికి అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఏటా రూ.20 లక్షలు హోంగార్డుల పిల్లల ఉన్నత చదువుల కోసం ఈ ఏడాది నుంచి



రైన్ కోట్స్‌ను అందజేస్తున్న ఎస్‌పి రాధిక

కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పి జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు ఎస్.వాసుదేవ్, వై.శృతి, డి.ప్రసాదరావు, ఆర్ఐ ఉమామహేశ్వరావు, హోంగార్డులు పాల్గొన్నారు.

హామీ మేరకు అభివృద్ధి పనులు



పనులు చేపడుతున్న కార్మికులు

ప్రజాశక్తి-పలాస

ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పదో వార్డు కౌన్సిలర్ శార్వాణి గీత రవి తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కొత్త పారసాంబ గ్రామంలో చేపడుతున్న రహదారి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి హయాంలో ఒక్క పైసా కూడా అభివృద్ధికి కూడా నోచుకోలేదన్నారు. ప్రస్తుతం మంత్రి అప్పలరాజు, చైర్మన్ గిరిబాబు సహకారంతో మంచి నీటి కోనేరు, దళిత వీధిలో తాగునీటి బావి, పవర్ బోర్, పెద్ద వీధిలో తాగునీటి పైపులైన్లు, తదితర పనులు చేపట్టినట్లు తెలిపారు. పాఠశాల నుంచి ముత్యాల పోలమ్మ గుడి వరకు రహదారి పనులు చేపట్టేందుకు టెండర్ పూర్తయినా కాంట్రాక్టరు ఇబ్బందుల వల్ల పనులు జాప్యమైందన్నారు. మరొక కాంట్రాక్టరు ద్వారా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్ అధికారులను ఆదేశించారని తెలిపారు. జంగాల వీధిలో త్వరలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వాలంటీర్లు కృష్ణా, పురుషోత్తం, కామేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై కక్షసాధింపు సరికాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై సానుకూల దక్పథంతో మెలగాలని, కక్షపూరిత ధోరణి విడనాడాలని పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కిల్లారి నారాయణరావు అన్నారు. పిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘానికి మూడోసారి అధ్యక్షునిగా ఎన్నికైన ఆయన్ను జిల్లా తూర్పుకాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నగరంలోని ఒక హోటల్‌లో శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను, హక్కుల సాధన కోసం ప్రభుత్వాలతో రాజీ లేని పోరాటాలు చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా తూర్పుకాపు సామాజిక వేదిక అధ్యక్షుడు శాసపు జోగినాయుడు అధ్యక్షతన నిర్వహించిన సభలో జిల్లా తూర్పుకాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు



సన్మానం చేస్తున్న తూర్పు కాపు సంక్షేమ సంఘం నాయకులు

డాక్టర్ ఎం.రామజోగినాయుడు, పి.తమ్మినాయుడు, రాడ కైలాసరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగర సుందరీకరణలో భాగంగా కలెక్టరేటు నుంచి కిన్నెర థియేటర్ వరకు ఉన్న జిల్లాపరిషత్ రోడ్డును రూ.1.02 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నామని, త్వరితగతిన పనులు ప్రారంభించి పనులు పూర్తి చేయాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పాతశ్రీకాకుళంలో రోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. గతంలో ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరిగిందని, ఇపుడు కొత్తగా కలెక్టరేటు నుంచి కిన్నెర జంక్షన్ వరకు రోడ్డు నిర్మించనున్నట్టు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. చేపట్టబోయే ఈ పనులకు పది కోట్ల రూపాయలు వెచ్చించనున్నారు. పాత శ్రీకాకుళంలో సంతోషిమాత గుడి దగ్గర నుంచి కిన్నెర థియేటర్ వరకూ రూ.62 లక్షలు , సంతోషిమాత గుడి నుంచి కలెక్టరేట్ వరకు రూ.40 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ఇప్పటికే టెండర్లు పూర్తి చేసుకోవడం జరిగిందని, కేఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ సంస్థ ఈ పనులు చేపట్టనుందని తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, మాజీ మున్సిపల్ చైర్మన్ మెంటాడ పద్మావతీ, వైసిపి నాయకులు సాధు వైకుంఠరావు, సుంకరి కష్ణ, చల్లా శ్రీనివాసరావు, అల్లు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.





ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి సుజాత

టిడిపితోనే మహిళలకు గౌరవం

తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి సుజాత

ప్రజాశక్తి - లావేరు

మహిళలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని విధాలుగా గౌరవాన్ని ఇచ్చింది తెలుగుదేశం పార్టీ అని తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత సురేష్ అన్నారు. టిడిపి మహాశక్తి కార్యక్రమాన్ని మండలంలోని నేతేరులో శనివారం నిర్వహించారు. తొలుతగా ర్యాలీ నిర్వహించిన అనంతరం ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయానికి మహిళా లోకం నడుంబిగించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గంటా సంధ్యా గజపతి, బాసి గోవిందరెడ్డి, కె.రమణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - ఆమదాలవలస

సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కోఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. శనివారం సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో యూనియన్ బ్యాంకు సహకారంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఆర్థిక అక్షరాస్యత పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్ వివరాలను అడిగితే సమాచారం ఇవ్వవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సిఎఫ్ఎల్ కోఆర్డినేటర్ రామారావు పాల్గొన్నారు.

అరసవల్లిలో జాతీయ జెండా అమ్మకాలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు జాతీయ జెండా అమ్మకాలను జిల్లా హెడ్ పోస్టుమాస్టరు బి.చంద్రమోహన్, అరసవల్లి ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ శనివారం ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో 'హర్ ఘర్ తిరంగా' 2.0 కార్యక్రమం పేరిట ఈ అమ్మకాలు చేపట్టారు. కార్యక్రమంలో అరసవల్లి సబ్ పోస్ట్‌మాస్టర్ యు.వి రమణ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అరసవల్లి ఆలయ ప్రాంగణంలో మెడికవర్ హాస్పటల్స్ ఆద్వర్యాన సందర్శకులకు, ఆలయ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. బిపి, షుగర్ ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ఓటరు సర్వే పరిశీలన

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని జంతూరు, బంజీరులో ఇంటింటి ఓటరు నమోదు సర్వేను జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ శనివారం పరిశీలించారు. బిఎల్ఒలు చేపడుతున్న సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను బిఎల్ఒలు పారదర్శంగా చేపట్టాలన్నారు. ఒకే డోర్ నంబరులో పదికి మించి ఓటర్లు ఉంటే పరిశీలించాలన్నారు. మార్పులు, చేర్పులు ఉంటే సంబంధిత ఫారంలో ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, బిఎల్ఒ సత్యనారాయణ, అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.